మరుపురాని మగువ

టెంపోరావ్

గదిలో లైటు వెలుగుతోంది. కిటికీ పక్కనే అతడు ఒంటరిగా పేము కుర్చీలో కూర్చున్నాడు. నేలమీద అరక్ బాటిల్ వుంది. గ్లాసులోని అరక్‌ను కొద్దిగా తాగి అతడు చార్మినార్ సిగరెట్ వెలిగించాడు.

బాటిల్ వైపు చూశాడు. సగం పైన తాగేశాడు. బాగా నిషాలో వున్నాడు. అయినా ఇంకా తాగుతూనే వున్నాడు.

టైమ్ చూశాడు. పదకొండు దాటింది. కిందనున్న గ్లాసును అతను అందుకున్నాడు. పూర్తిగా తాగేసి గ్లాసులో మళ్ళా అరక్ పోశాడు.

ఎవరో తలుపుమీద దబదబా కొట్టారు. యెవరై వుంటారు?

"తొందరగా తలుపు తెరువు బాబూ!" అర్చింది ఒక స్త్రీ కంఠం అటువైపునుంచి.

అతను తూలుతూ లేచాడు. గుమ్మంవైపు అడుగులేసి

తలుపు తెర్చాడు.

బయట నిలబడిన యాభై ఏళ్ళ స్త్రీ అతడివైపు గాభరాగా చూసింది.

"బాబూ, అమ్మాయికి నొప్పులు వస్తున్నాయి. వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్ళాలి. సమీపంలో టాక్సీ దొరక్క ఇక్కడికొచ్చాను" అందామె.

ఎర్రటి కళ్ళతో అతడామెవంక చూశాడు. ఎందుకో ఆమె త్రుళ్ళిపడింది. వెనక్కు తిరిగింది.

"హాస్పిటల్ కు తీసుకువెళ్తాను" అన్నాడతను. ఆమె తిరిగి అతడివైపు చూసింది.

"ఈ స్థితిలో టాక్సీ నడపగలవా?" అనుమానంతో అడిగింది.

"నడపక తప్పదుగా! అని అతడు నవ్వాడు.

"వద్దు బాబూ!" అందామె.

"మీరు భయపడకండి! మీ అమ్మాయి ఎక్కడుంది? డోసులో వున్నా సరిగ్గా కారు నడపడం నాకలవాటే."

"పక్కవీధిలో మూడో ఇల్లు!"

అతడు తలుపు మూసి తాళం వేశాడు. టాక్సీ ఇంటి ముందు రోడ్డు వారగా వుంది. తలుపు తెర్చి ఆమెను ఎక్కమన్నాడు.

టాక్సీని వేగంగా పక్కవీధిలోకి పోనిచ్చి మూడో ఇంటిముందు ఆపాడు. బయటకు దిగి ఆమె పరుగెత్తింది. ఇరవై రెండేళ్ళ యువతిని తీసుకొచ్చి కారు వెనక సీటు మీద పడుకోబెట్టింది. టాక్సీ పక్కనే నిలబడిన అతడికి ఆమె మూలుగులు వినిపిస్తున్నాయి. ఒక ప్లాస్టిక్ బుట్ట పట్టుకుని, ఇంటికి తాళంవేసి తల్లి కారులో కూర్చుంది.

తలుపుమూసి అతడు టాక్సీని పోనిచ్చాడు. అతడు

ఎలా నడుపుతాడో అని వెనక కూర్చున్న తల్లి గాభరా పడ్తోంది. కాస్సేపట్లో ఆమె గాభరా అదృశ్యమైంది.

బాగా తాగివున్నా అతడు టాక్సీని సవ్యంగానే పోనిస్తున్నాడు. కాస్సేపట్లో అతడు టాక్సీని హాస్పిటల్ కాంపౌండులో ఆపి, తొందరగా దిగి తలుపు తెర్చాడు.

ప్లాస్టిక్ బుట్టను అతడు తీసుకున్నాడు. ఆమె కూతుర్ని లోపలకు తీసుకువెళ్ళింది. తిరిగివచ్చి ప్లాస్టిక్ బుట్టను అందుకుంది.

అతడివంక దీనంగా చూసింది.

"బాబూ, నీకెంత ఇవ్వాలి? మీటరులో యెంత యింది?"

"మీటరులో నాలుగున్నరయింది."

"ఎంతివ్వమంటావు?"

"నేను మీతో బేరమాడలేను. ఇవ్వండి ఎంతో కొంత."

"ఆయన ఇంట్లో లేరు. చేతిలో ఎక్కువగా డబ్బు లేదు. తర్వాత పట్టుకొచ్చి యిస్తాను" అందామె.

"అలాగే చేయండి" అని అతడు వెనక్కు తిరిగాడు.

ఆమె లోపలకు వెళ్ళిపోయింది. అతడు సీటుమీద కూర్చొని తలుపుమూశాడు. టాక్సీని పోనిచ్చాడు.

అతడి మెదడులో ఏవేవో దృశ్యాలు ఫిలిమ్ షాట్స్‌లా కదులున్నాయి. ఒక యువతి ముఖం మెదడులో మెది లింది. ఏదో బాధ! అతడు బ్రేక్ నొక్కి టాక్సీని రోడ్డు వారగా ఆపాడు. గుండెల్లో నొప్పి! కొన్ని నిమిషాల పాటు అతడు అలాగే కూర్చుండిపోయాడు.

గతంలో జరిగినది గుర్తొస్తోంది!

ఆమె అతడి పక్కనే టాక్సీలో వుంది. ఆమె తీయగా

నవ్వుతోంది. ఆమె నడుం చుట్టూ చేయిపోనిచ్చి దగ్గరగా లాగి పట్టుకున్నాడు. కుడిచెయ్యి స్టీరింగ్ వీల్ మీదవుంది.

"మంజూ!" పిల్చాడతను.

అది ఆమె పేరుకాదు. అతడామెకిచ్చిన ముద్దుపేరు.

"చెప్పు రామ్" అందామె.

"నువ్వు లేకుండా క్షణంకూడా నేను బ్రతకలేను!" అన్నాడతను.

"నేను బ్రతగ్గలనా?" ప్రశ్నించిందామె.

ఆడవాళ్ళ మాటలకు అర్థాలు వేరని అంటారు. తనని మర్చిపోయి ఆమె మరో వ్యక్తిని పెళ్ళిచేసుకుంది. తను కలలుగన్న మంజూ తనకు శాశ్వతంగా దూరమైంది.

ఈ జీవితంలో ఇక ఆమె తనకు దొరకదు. తనొక భగ్న జీవి!

ఎవరో కారుమీద వేళ్ళతో కొట్టారు. అతడు కళ్ళు తెరిచి చూశాడు. ఒక ఆంగ్లో ఇండియన్ యువకుడు, యువతీ టాక్సీ పక్కనే నిలబడివున్నారు.

"వస్తావా?"

"ఎక్కడికి?"

"బీచ్‌కి. అక్కడ మేము గంటసేపు వుంటాం. అంత వరకూ వుండాలి. మళ్ళా ఇక్కడ దింపాలి."

"ఇరవై అయిదు రూపాయలు ఇవ్వాలి!" అన్నాడతను.

"యాభై అడుగుతావేమో అని భయపడ్డాను. కమాన్ డార్లింగ్" అన్నాడా యువకుడు.

"ఓ మెడియూర్" అంటూ ఆమె టాక్సీలోకి దూరింది.

ఆమె పక్కనే కూర్చున్నాడతను. కారు కదిలింది స్పీడుగా వెళ్తోంది. వెనుకనుంచి విచిత్రమైన చప్పుళ్ళ

వినిపిస్తున్నాయి.

"ఇంకా బీచ్ రాలేదు!" అన్నాడు టాక్సీ నడిపే అతను వెనక్కు చూడకుండా.

"నీ టాక్సీ బాగుంది, మిస్టర్, మూవింగ్ బీచ్‌లా వుంది" అన్నాడా యువకుడు నవ్వుతూ.

అతడు ఆలోచిస్తూ టాక్సీని పోనిస్తున్నాడు. ఈ నాడు జంట చిలకల్లా వాళ్ళిద్దరూ వెనక వున్నారు. కాని ఎప్పుడో ఆమె అతడిని వదిని వెళ్ళిపోతుంది!

సముద్రపు హోరు వినపడుతోంది. బీచ్ లోపల రోడ్డుకి పోనిచ్చి అతడు టాక్సీ ఆపాడు. వుషారుగా వాళ్ళిద్దరూ కిందికి దిగారు.

యాంగ్లో ఇండియన్ యువకుడు అతడివైపు చూస్తూ క్వార్టర్ బాటల్ను అందించాడు.

"మిస్టర్, అందులో కొంత రమ్ వుంది. తాగుతూ కూర్చో!" అని వెళ్ళిపోయాడు.

అతడు బాటిల్ని చూశాడు. సంగం పైన వుంది రమ్ అందులో. మూతతీసి కొంచెం తాగాడు. ఘాటుగా, వేడిగా రమ్ గొంతులోకి దిగింది. అతడు వాళ్ళవైపు చూశాడు.

ఇసుకలో నడుస్తూ ఇద్దరూ వెళ్తున్నారు. కొంత సేపట్లో వాళ్ళ రూపాలు అదృశ్యమయ్యాయి.

వాళ్ళకింకా పెళ్ళయి వుండదు. ప్రేమ వలలోపడి ఇద్దరూ రహస్యంగా, పెద్దలకు తెలియకుండా, బీచ్‌కి వచ్చుంటారు. పెదానికి ఎంత దగ్గరగా వెళ్ళినా కప్పుకీ, పెదానికీ మధ్య ఎంతో దూరం వుంది!

రమ్ సేవిస్తూ ఆలోచిస్తూ అతడు కూర్చున్నాడు.

2

సెంట్రల్ స్టేషన్‌లో టాక్సీ ఆపి అతడు బేరంకోసం చూస్తున్నాడు. కాని ఎవ్వరూ తన టాక్సీవైపు రాలేదు.

పట్నంలో టాక్సీలు ఎక్కువయ్యాయి. ఒక్కోసారి కస్టమర్లు దొరకరు. అతడు చార్మినార్ సిగరెట్ పీలుస్తూ టైమ్ చూశాడు. ఏడైంది.

ఒక యువతి సూటుకేసు పట్టుకుని టాక్సీ పక్కకు వచ్చింది. అతడామెవైపు చూశాడు.

ఆమె వయస్సు యిరవై వుంటుంది. టాక్సీలో ప్రయాణంచేసే మనిషిలా ఆమె కనబడ్డంలేదు. అంత అందమైనది కాకపోయినా అనాకారి కాదు.

"ఎక్కడికెళ్ళాలి?" ప్రశ్నించాడతను.

ఆమె టాక్సీ దగ్గరగా వచ్చింది. అతడివంక సూటిగా చూసింది.

"ఒంటరిగా విజయవాడనుంచి వచ్చేశాను" అందామె.

అతడు ముందు తలుపు తెరిచి ఆమెను ఎక్కమన్నాడు. అతడి పక్కనే కూర్చుని ఆమె తలుపు మూసింది. అతడు టాక్సీని పోనిచ్చాడు.

"ఒంటరిగా ఎందుకొచ్చావు?"

"నా మొగుడు తప్పతాగి రోజూ తన్నుతాడు. జీవితంలో విసుగెత్తింది. అతడు మారడు. అందుకని వచ్చేశాను" అందామె.

టాక్సీ స్పీడుగా వెళ్తోంది. ఆమెవైపు అతడు ఓరగా చూశాడు.

"నీ, మెళ్ళో మంగళ సూత్రంలేదు!"

"ఎప్పుడో అమ్మి తాగేశాడు. పసుపుకొమ్ములు వుండేవి. వాటిని కృష్ణానదిలో పారేసి ఇలా వచ్చేశాను."

"ఈ మహాపట్నంలో యెక్కడుంటావు? ఏం చేస్తావు?" అడిగాడతను.

"ధనవంతుల ఇళ్ళలో పనిమనిషిగా వుంటాను. తిండి పడేసి ఎంతో కొంత జీతం ఇస్తారు."

"అన్నీ ఆలోచించే వచ్చావన్నమాట!"

"విజయవాడలో ఒక డాక్టర్ గారి ఇంట్లో నేను పనిచేసేదాన్ని. నా భర్త దెబ్బలబాధ భరించలేక నేను ఏడుస్తూంటే ఆయనే ఇక్కడకు పొమ్మన్నారు. నౌఖర్లు దొరకడం ఇక్కడ కష్టంగా వుందట."

తన గదిముందు అతడు టాక్సీ ఆపాడు. ఆమెను గదిలోకి తీసుకు వెళ్ళాడు. ఏమాత్రమూ భయపడకుండా ఆమె గదిలోకి వెళ్ళింది.

అతడామెవైపు నవ్వుతూ చూశాడు.

"నీ పేరు?"

"మాధవి"

"మంచి పేరు. నీకు ఉద్యోగం దొరికిందాకా ఇక్కడ వుండొచ్చు."

ఆమె అతడివంక నవ్వుతూ చూసింది.

"నువ్వు చాలా మంచివాడివి. నిన్ను నేను మర్చిపోను" అందామె.

అతడు టైమ్ చూశాడు.

"మాధవీ, వంట చేయడానికి అన్నీ వున్నాయి. నేను బయటకు పోయి ఒంటిగంట కొస్తాను. ఈలోపల వంట ముగించు. నువ్వు తిని విశ్రాంతి తీసుకో. నాకోసం కూర్చోవద్దు!" అని అతను బయటకు పరుగెత్తాడు.

టాక్సీ కదిలిన శబ్దం ఆమెకు వినబడింది. ఆమె తలుపు మూసి గడియలు పెట్టింది. గది విశాలంగా వుంది.

పక్కనే బాత్ రూమ్, లాట్రిన్ వున్నాయి. ఈ ఫ్లాట్ కి అద్దె ఎంతో?

ఆమె ముందు గదిలోకి తిరిగివచ్చి నలువైపులా చూసింది. కిరోసిన్ స్టవ్, వంటపాత్రలు కనిపించాయి. బుట్టలో కూర లున్నాయి.

అలమారులో ఎన్నో డబ్బాలున్నాయి. వాటిని ఆమె తెరిచి చూసింది. పప్పులు, మిరపకాయలు, వుప్పు, చక్కెర వగైరా అన్నీ వున్నాయి.

ప్రతిరోజూ అతడు వంట చేసుకుని తింటాడేమో! రోజంతా టాక్సీ తో లేవాడికి వంట చేసుకోడానికి టైమ్ ఎలా వుంటుంది?

ఆమె ఆలోచిస్తూ కుర్చీలో కూర్చుంది. అతడికి పెళ్ళయిందా? పెళ్ళయితే భార్య ఎక్కడుంది? అనేక ప్రశ్నలు!

తనకు ఆశ్రయమిచ్చిన వ్యక్తితో అబద్ధాలు చెప్పి నందుకు ఆమె లోలోపల విచారించింది.

తనకింకా పెళ్ళికాలేదు. దిక్కులేక తను మావయ్య ఇంట్లో పెరిగింది. అతడికి తనమీద మోజు ఎక్కువ. తనని పొందడానికి అతడు యెప్పుడూ ప్రయత్నిస్తూనే వున్నాడు. కాని అత్తయ్య గుడ్డిదికాదు. అదంతా గమనించింది.

"పిల్లా, ఇహ నువ్వు ఇక్కడుంటే ప్రమాదం. నీ జీవితం పాడవుతుంది. నా సంసారం నాశన మవుతుంది. నువ్వు మరో చోటకి పో!" అంది అత్తయ్య ఒకరోజున.

"సరే, పోతాను" అందామె.

తను దాచుకున్న డబ్బుతో అత్తయ్య తనకు రైలు టికెట్ కొని ఇచ్చింది. పైన పది రూపాయలు ఇచ్చింది.

అత్తయ్య స్వయంగా వచ్చి తనను ట్రెయిన్ ఎక్కించింది.

ఏడుస్తూ అత్తయ్య తన చెయ్యి పట్టుకుంది. "నీ మేలు కోరే వెళ్ళమన్నాను, పిల్లా! అతడి కామానికి నువ్వు బలిపశువు కావడం నాకిష్టంలేదు. నువ్వు ఎక్కడున్నా దుర్గమ్మ నీ జీవితాన్ని సరిదిద్దుతుంది. ధైర్యంగా వెళ్ళి జయించి, సుఖపడు!" అంది అత్తయ్య కన్నీళ్ళతో.

"అత్తయ్యా, నిన్ను మళ్ళీ ఎప్పుడు చూస్తానో?" అంది తను ఏడుస్తూ.

"బెంగెట్టుకోకు, పిల్లా! మొంగుదిక్కు లేని ఆడదాన్ని ఆటవస్తువుగా చూడ్డం మనదేశంలోని పురుషులకు అల వాటైపోయింది. ఎవరో నిన్ను ఆదరించి పెళ్ళాడతారు. నీ భర్తతో నువ్వు ఇక్కడకు వచ్చి మమ్మల్ని చూడొచ్చు!" అంది అత్తయ్య.

ట్రెయిన్ కంపార్టుమెంటు కిటికీలోంచి బయట నిల బడిన అత్తయ్యవైపు ఆమె చూసింది.

"అత్తయ్యా, నేను ఎక్కడకి వెళ్ళానని మావయ్య అడిగితే ఏం చేస్తావు?"

"నాకు తెలియదంటాను. నీ రాకకోసం ఎదురుచూస్తూ అతడు కూర్చుంటాడు. కాని నువ్వు రావుగా! ఏమైందని గొణుగుతాడు. నీ పోరు పడలేక యెక్కడికో పోయి వుంటుందని చెప్తాను. దానితో అతడు నోరు మూసు కుంటాడు."

"నా మూలంగా మీకే ప్రమాదమూ రాకూడదని దుర్గమ్మను ప్రార్థిస్తున్నాను" అందామె.

"అతడు ఏం చేస్తాడు? నువ్వు కంటబడకపోతే అతడికి నేనే రంభలా కనిపిస్తాను."

అటు పైన రైలు కదిలింది. ప్లాట్ ఫామ్‌మీద నిలబడిన ఆ త్యాగమూర్తి తను దూరమైపోయింది.

"దుర్గమ్మా, నన్ను రక్షించు!" అనుకుందామె లోలోపల.

3

కొత్తగా కొన్న అరక్ బాటిల్ను తెరిచి అతడు గ్లాసులో పెదాకా పోసుకున్నాడు. మెల్లిగా తాగడం ప్రారంభించాడు.

రైటు వెల్తురొంది. టైమ్ తొమ్మిది దాటింది. మాధవి అతడికెదురుగా చాపమీద కూర్చుంది.

ఆమె బాటిల్ వైపు ఆశ్చర్యంగా చూసింది.

"అదంతా తాగేస్తావా?" అడిగిందామె.

అతడు పకపక నవ్వాడు.

"తాగలేనా?"

"ఎక్కువ తాగడం మంచిదికాదు. నా గతి ఏమైందో చూడు! అతడలా తాగి తన్నడంవల నేగా ఇంతదూరం వచ్చేశాను" అందామె.

"మాధవీ, నువ్వు భయపడకు! తాగినవాళ్ళందరూ భార్యలను తన్నరు. తన్నే అలవాటున్నవాళ్ళు తాగక పోయినా తంతారేమో!"

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది. అతడు గ్లాసులోని అరక్‌ను తాగేసి మళ్ళీ పోసుకున్నాడు.

"చక్కగా టాక్సీ నడుపుకుని బతుకుతున్నావు. మంచి ఇల్లుంది. నీకు ఏ లోటూ లేదు. రోజూ ఇలా తాగితే నీ ఆరోగ్యం చెడిపోతుంది" అందామె.

"తాగితేగాని నేను బతికుండలేను. తాగక తప్పదు. ఈ తాగుడే జీవంపోసి నన్ను బతికిస్తోంది" అన్నాడతను.

"నీ మాటలు వింటూంటే గతంలో ఏదో జరిగుండాలి అనిపిస్తోంది. ఏమైంది?" ప్రశ్నించిందామె.

"ఎప్పుడో నీతో చెప్తాలే!" అని ఆగి అతడు ఆరక్ తాగుతూ వుండిపోయాడు.

గ్లాసులోని ఆరక్‌ను తాగేసి ఆమెవైపు చూశాడు. ఆమె తల దువ్వుకుని, పూలు పెట్టుకుంది. నుదురుమీద ఎర్రటి బొట్టు. అందంగా, అమాయకంగా కనిపిస్తోంది.

"నువ్వు పనిచేయడానికి ఒక ఇల్లు కనిపెట్టాను" అన్నాడతను.

"ఎక్కడ?"

"అదంతా తర్వాత చెప్తాను. ఆ ఇంట్లో వాళ్ళకు పనిమనిషి కావాలని తెలుసుకున్నాను. నా గురించి వాళ్ళకు నువ్వేమీ చెప్పకూడదు. ఆ ఇంట్లో వుండి అక్కడి వివరాలు నువ్వు నాకు అందిస్తూ వుండాలి."

"ఎందుకు?"

"ప్రశ్నలు వేయకూడదు. నేను చెప్పినట్లు చేస్తే ఆ ఉద్యోగం నీకు వస్తుంది."

"అలాగే చేస్తాను" అందామె.

"నీ గురించి నాకు చెప్పినదే వాళ్ళకు చెప్పు. భర్త తన్నులు భరించలేక వచ్చేసిన యువతికి ప్రజల సానుభూతి బాగా లభిస్తుంది. నిన్ను ఆ ఇంట్లోనే వుండి పని చేయమంటారు. అక్కడ వుండి రహస్యంగా నాకు కావలసిన సమాచారం నువ్వు అందించవచ్చు."

ఆమె తలాడించింది. గ్లాసులో ఆరక్ పోసుకుని అతడు సగంపైన తాగేశాడు.

"అక్కడికెళ్ళాక ప్లేటు మార్చకూడదు."

ఆమె తీయగా నవ్వింది.

"భోజనం చెయ్యకూడదమూ? వంకాయి వేపుడు చల్లారితే బాగోదు!" అందామె.

"ఈ గ్లాసులోది తాగాక తింటాను."

"నేను వడ్డిస్తూ వుంటాను" ఆమె లేచింది.

అతడు గ్లాసును ఖాళీచేసి సిగరెట్ పాగ పీల్చి ఆమెవైపు చూశాడు. మెల్లిగా లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కొని వచ్చాడు. నేల మీద కూర్చున్నాడు.

"అలమారులో మరో కంచం వుంది. నువ్వూ పెట్టుకో ఇద్దరం తిందాం" అన్నాడతను.

"తర్వాత తింటాలే" అందామె.

అతడు లేచి అలమారులో వున్న కంచాన్ని నేలమీద పెట్టాడు.

"వడ్డించుకో" అన్నాడతను.

ఇద్దరూ తినడం ప్రారంభించారు.

"నీ వంట చాలా బాగుంది" అన్నాడతను.

"నా వంటను మెచ్చుకునేవాడు ఒకడున్నందుకు సంతోషం" అందామె.

అతడామెవైపు చూశాడు.

"నీ భర్త ఎప్పుడూ మెచ్చుకోలేదా?"

ఆమె వెంటనే జవాబివ్వలేదు. అతడివైపు సూటిగా చూసింది.

"నీతో అబద్ధం చెప్పాను. నన్ను క్షమించు. నాకు పెళ్ళికాలేదు. నేను దిక్కు లేని కన్నెపిల్లని."

అతడామెవైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఎందుకిలా వచ్చేశావు?"

ఆమె నిజం చెప్పేసింది. ఆమె కళ్ళమ్మట నీళ్ళు

కారుతున్నాయి.

"మాధవీ, ఏడవకు! మనదేశంలో కొందరు పురుషులు నీ మామయ్యలా వుంటారు. వాళ్ళు చేసే కీచక చర్యలు బయట పడవు!"

ఇద్దరూ భోజనాలు ముగించారు. అతను చాప తలగడ పట్టుకుని ఆమెవైపు చూశాడు.

"నువ్వు గదిలో నిద్రపో! నేను బయట పడుకుంటాను. నీకు ఇక్కడే పక్క వుంది."

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"నాకు భయంలేదు. నువ్వు ఇక్కడే పడుకో" అందామె.

"ఆ మాట విని చాలా ఆనందిస్తున్నాను. తాగిన వాడిని చూసి స్త్రీలు భయపడ్తారు."

దూరంగా పక్క వేసుకుని అదే గదిలో ఇద్దరూ పడుకున్నారు. గదిలో చీకటిగా వుంది."

ఆమె ఆలోచిస్తూ పడుకుంది. కాని అతడికి క్షణంలో నిద్రపట్టేసింది.

4

పోర్టికోలో కారు ఆగివుంది. మోహనరావు వుషారుగా కారువైపు నడిచాడు. అతడి భార్య సుందరి వెనకనే వెళ్ళింది. ఆమె చేతుల్లో వున్న కొడుకును అతడు వంగి ముద్దుపెట్టుకున్నాడు.

"బై డార్లింగ్" అని అతడు కారులో ఎక్కి తలుపు మూశాడు.

కారు కదలింది. గేటువైపు పోతున్న కారుకేసి చూస్తూ సుందరి నిలబడింది. గేటుదాటి కుడివైపుకు తిరిగి కారు వెళ్ళిపోయింది.

అదే సమయంలో యెవరో స్త్రీ లోపలకు వస్తోంది. పోర్టికో మెట్టుమీద నిలబడి సుందరి ఆమెకేసి చూస్తూ వుండిపోయింది. కాస్సేపట్లో ఆమె పోర్టికోలోకి వచ్చింది. నవ్వుతూ సుందరికి నమస్కారించింది.

"ఏం కావాలి?" అడిగింది సుందరి.

"విజయవాడనుంచి వచ్చానమ్మా. ఏదేనా పని దొరుకుతుందేమో అని చూస్తున్నాను" అందామె.

"ఇంత దూరం ఎందుకొచ్చావు?"

"అక్కడ బతకలేకమ్మా. అక్కడ జీవితం దినదిన గండంగా గడిచేది. తాగొచ్చి నా మొగుడు నన్ను చావగొట్టేవాడు. ఎంతకాలం భరించడం? విసుగెత్తి ఇలా వచ్చేశాను."

ఆలోచిస్తూ సుందరి ఆమెవంక చూసింది. ఆమె చేతిలో చిన్న సూటుకేసు వుంది.

"ఈ పట్నంలో తెలిసినవాళ్ళు ఎవరేనా వున్నారా?"

"లేరమ్మా."

"ఆయన ఆఫీసుకెళ్ళారు. ఆయన్ని అడిగి చెప్తాను."

"మరికొన్ని ఇళ్ళకు వెళ్ళి అడిగివస్తానమ్మా" అని ఆమె వెనక్కు తిరిగింది.

"వుండు! అలా కూర్చో!" అని సుందరి లోపలకు పరుగెత్తింది. కొడుకును సోఫాలో పడుకోబెట్టి హాల్లోని టెలిఫోన్ దగ్గరకు నడిచింది. రిసీవర్ ఎత్తి ఒక నంబరు తిప్పింది.

"హలో, మోహన్ అసోసియేట్స్!" అందో స్త్రీ కంఠం అటువైపునుంచి.

"మావారితో మాట్లాడాలి" అందామె. వెంటనే కనెక్షన్ ఇవ్వబడింది.

"సుందరీ, ఏం కావాలి?"

"ఎవరో పనిమనిషి వచ్చింది. మంచిదానిలా వుంది. మనింట్లోనే వుండి అన్ని పనులు చేసిపెడుతుంది" అందామె.

"దాన్ని ఎక్కడికీ పోనీయకు! వెంటనే పనిలో చేరమను. టిఫిన్, కాఫీ, తిండి జీతం అన్నీ ఇస్తామని చెప్పు. పనిమనిషి దొరక్క చస్తున్నాం" అన్నాడతను.

"అలాగే."

"అబ్బాయి ఎలా వున్నాడు?"

"సోఫాలో పడుకుని డాన్స్ చేస్తున్నాడు."

"ఆల్ రైట్, అంతేనా?"

"అంతే" అని ఆమె రిసీవర్ పెట్టేసింది.

సోఫాలో కొడుకు పక్కనే కూర్చుని పనిమనిషిని పిలిచింది. ఆమె వినయంగా లోపలికి వచ్చింది.

"నీ పేరు?"

"మాధవి."

"నువ్వు వెంటనే పనిలో చేరొచ్చు. టిఫిన్, కాఫీ, రెండు పూట్లా భోజనం ఇస్తాం. జీతం 50 రూపాయలు. అన్ని పనులూ నువ్వు చూసుకోవాలి. వంటకి మరొకామె వుంది."

"అలాగేనమ్మా" అంది మాధవి.

"ప్రస్తుతం యీ హాల్లోనే వుండు. ఎవరైనా వస్తే పైకొచ్చి నాకు చెప్పు. వెనకనున్న గదిలో నీ సూట్‌కేసు పెట్టుకోవచ్చు. అక్కడే రాత్రిళ్ళు పడుకోవచ్చు."

"మంచిదమ్మా."

"సావిత్రమ్మగారూ!" సుందరి పిల్చింది.

నలభై ఏళ్ళ స్త్రీ లోపలనుంచి హాల్లోకొచ్చింది.

"పిల్చారా?"

"ఈమె కొత్త పనిమనిషి. మనింట్లోనే వుంటుంది. వెనక గది చూపించండి. అక్కడ వుంటుంది."

సావిత్రమ్మ ఆమెకేసి ఎగాదిగా చూసింది. "రా నాతో" అందామె. వాళ్ళిద్దరూ లోపలకు వెళ్ళారు. సుందరి కొడుకును ఎత్తుకుని పైకి వెళ్ళింది.

"నీ పేరు?"

"మాధవి అమ్మగారూ."

"పెళ్ళయిందా?"

"అయిందండి."

"నీ భర్త ఏడీ?"

"అతడు విజయవాడలో వున్నాడండి. ఇద్దరం విడిపోయాం. అతడు తాగుబోతు, అమ్మగారూ. అందుకే ఇక్కడికొచ్చేశాను."

సావిత్రమ్మ తన భర్త గురించి ఆలోచించసాగింది. అతడూ బాగా తాగుతాడు. కాని భార్యను కొట్టడు. తాగి, తిని గుర్రు పెడుతూ నిద్రపోతాడు.

"నువ్వు ఇంకా చిన్నదానవు. భర్తను వదలడం మంచిదికాదు" అంది సావిత్రమ్మ.

"ఎముకలు విరిగేటట్లు కొడ్తావుంటే విడిపోక మరేం చెయ్యగలనమ్మా?"

తాగినా తన భర్త మంచివాడని సావిత్రమ్మ సంతోషించింది.

"పొద్దుట టిఫిన్ తిన్నావా?"

"లేదమ్మా."

"అయితే రా, వుప్మా వుంది, ఇస్తాను" అని ఆమె వంటగదివైపు కదిలింది.

పెద్ద మేడ. ఒకవైపున పూలమొక్కలు, మరోపక్క చక్కటి తోట. నలువైపులా ప్రహరీ. గోడ ముందు గేటు ప్రాంతంలో గూర్ఖా పచార్లు చేస్తూ వుంటాడు.

కిందా, పైనా మాధవి తిరిగి చూసింది. అంత పెద్ద ఇంట్లో వుండేవాళ్ళు కోటీశ్వరులై వుండాలి. సుందరి చాలా అదృష్టవంతురాలు, అనుకుంది మాధవి.

సాయంత్రం ఆరు కావస్తోంది. "మాధవీ!" పిల్చింది సుందరి. పనిమనిషి వుషారుగా హాల్లోకొచ్చింది.

"బాబుతో అలా బీచ్‌కి వెళ్ళాలి" అని పనిమనిషి దుస్తులవైపు చూసింది.

పక్కనున్న గదిలోకి సుందరి వెళ్ళింది. రెండు చీరలు, రెండు జాకెట్లు తెచ్చి పనిమనిషికిచ్చింది.

"ఇటువైపున ఇవి నీవి. ఈ రెండింటిలో ఏదో ధరించి తొందరగా రా" అంది సుందరి.

లోపలకు పరుగెత్తుకెళ్ళి కాస్సేపట్లో మాధవి తిరిగి వచ్చింది. ఆమెవైపు సుందరి సంతోషంగా చూసింది.

"ఇప్పుడు చక్కగా వున్నావు. బాబును తీసుకో" అందామె.

మాధవి బాబును తీసుకుంది. సుందరి కారు షెడ్ వైపు వెళ్ళింది. కాస్సేపట్లో ఫియట్ కారును తోలు కొచ్చి పోర్టికోలో ఆపింది.

"ఆపక్క ఎక్కు" అంది సుందరి తలుపు తెరుస్తూ.

సుందరి కారును పోనిచ్చింది. పక్కనే వుంది మాధవి. ఆమె ఒళ్ళో ఆడుకుంటున్నాడు బాబు.

గేటు ముందున్న గూర్ఖా సుందరికి వినయంగా నమస్కరించాడు.

రోడ్డమ్మట కారు స్పీడుగా వెళ్తోంది. బాబు మాధవి ఒళ్ళో కూర్చుని బయటకు చూస్తున్నాడు.

"అయ్యగారు బీచ్‌కి రారా?" అడిగింది మాధవి.

"అయ్యగారు పొద్దుట వెళ్తారు. రాత్రి ఏ పన్నెండింటికో వస్తారు" అంది సుందరి.

"ఆయన ఉద్యోగం ఏమిటమ్మా?"

"ఆయన వ్యాపారంలో ఉన్నారు. ఆయనకు పంచదార, సిమెంట్ ఫ్యాక్టరీలు వున్నాయి."

"మగమహారాజమ్మా" అంది మాధవి.

బీచ్ లోపల రోడ్డుమీద కారు ఆగింది. ఇద్దరూ కిందికి దిగారు. బాబు ఇసుకలో మెల్లిగా అడుగులు వేస్తున్నాడు. మాధవి అతడి చెయ్యి పట్టుకుంది.

చక్కటి దుస్తుల్లో బాబు చాలా అందంగా వున్నాడు. అందరూ అతడినే చూస్తున్నారు.

"ఇంటికెళ్ళాక వుప్పుదిష్టితీసి పారేయాలమ్మా. అందరి కళ్ళూ బాబుమీదే వున్నాయి" అంది మాధవి.

"అది నువ్వే చెయ్యాలి" అంది సుందరి.

వాళ్ళు సముద్ర పొడ్డుకు నడిచి ఆగారు.

హోరుమంటూ కెరటాలు ముందుకొచ్చి, పగిలి, నురుగులు కక్కుతూ వెనక్కి పోతున్నాయి. సముద్రపు గాలి హాయిగా వుంది. కొంచెం వెనక్కి నడిచి ఇద్దరూ ఇసుకలో కూర్చున్నారు. బాబు ఇసుకలో ఆడుకుంటున్నాడు.

"మీ పెళ్ళయి ఎన్నేళ్ళయిందమ్మా?"

"ఇంకా మూడేళ్ళు కాలేదు. సీజరియన్ ఆపరేషన్ చేసి యీ బిడ్డను బయటకు తీయవలసి వచ్చింది. ఈ జీవితంలో ఈ ఒక్క బిడ్డా చాలనిపిస్తోంది" అంది సుందరి.

"అలా అంటారేమిటమ్మా! మీలాంటి ధనవంతులకు

ఎంతమంది పిల్లలున్నా ఫరవాలేదు."

"ధనం ఒక్కటే కాదు, పిల్లల్ని కనే ఆరోగ్యం కూడా వుండాలి. ప్రతిసారీ సీజరియన్ ఆపరేషన్‌తో బిడ్డను కనడం కష్టతరమైన పని" అంది సుందరి.

"మీరు గొప్పింటి కోడలయారమ్మా. మీ తండ్రిగారు కూడా ధనవంతులై వుండాలి" అంది మాధవి.

సుందరి నవ్వింది. "మా నాన్నగారు ధనవంతులు కారు. ఉద్యోగంలో వున్నారు. మా ఆయన కంపెనీలోనే నాన్నగారు పని చేస్తున్నారు."

మాధవి చెవులప్పగించి వింటోంది.

"నాకొచ్చిన సంబంధం వెతికితే ఎక్కడా దొరకదు. విధి చేకూర్చిందని చెప్పాలి. ఒకనాడు హోటల్ పార్టీలో నాన్నగారు నన్ను ఆయనకు పరిచయం చేశారు. అంతే. అటుపైన విధి రథచక్రాలు వేగంగా తిరిగిపోయాయి. నన్ను పెళ్ళాడ్తానని ఆయన పట్టుబట్టి కూర్చున్నాడు. అలాగే మా పెళ్ళయిపోయింది. నాన్నగార్కి పైసా కూడా ఖర్చులేదు. మా పెళ్ళిని నా మామగారే జరిపించారు."

"అదృష్టం వస్తే వరదలా వస్తుందమ్మా" అంది మాధవి.

చీకటిపడింది. దూరంలో రోడ్డు లైట్లు వెలుగుతున్నాయి.

"మాది పెద్ద కుటుంబం. నాకు ముగ్గురు అన్నలు వున్నారు. ఇద్దరు అక్కలు, ముగ్గురు చెల్లెళ్ళు. నన్ను బి.ఏ. దాకా చదివించడానికే నాన్నగారు ఎంతో కష్టపడ్డారు. నెలజీతాలమీద జీవించే కుటుంబాలు అలాగే వుంటాయి."

మాధవి నవ్వుతూ ఆమెవైపు చూసింది.

"విధి నన్ను మీ ఇంటికి రప్పించిందమ్మా. మీ దగ్గర

పనిచేసేవాళ్ళు కూడా అదృష్టవంతులు అవుతారమ్మా" అంది మాధవి.

"అందరూ ఆనందంగా వుండాలని నా ఆశ! పద, పోదాం" అంది సుందరి.

బాబును తీసుకుని వాళ్ళు కారువైపు నడిచారు.

6

అతడు వుషారుగా గదిలోకి వచ్చాడు. స్విచ్ ఆన్ చేశాడు. లైటు వెల్గింది. అలసటతో అతడు పేము కుర్చీలో కూర్చున్నాడు.

పొద్దుటనుంచీ అతడు టాక్సీని నడుపుతూనే వున్నాడు. బేరంమీద బేరం!

సరిగ్గా తిండికూడా తినలేదు. కాని అతడు బాధ పడలేదు. తిండిమీద మోజు అతడికెప్పుడో పోయింది.

అతడు లేచాడు. బాత్‌రూంలోకి వెళ్ళి స్నానం చేశాడు. పేము కుర్చీలో కూర్చుని కొత్త అరక్ బాటిల్ని తెరిచాడు. గ్లాసులో అరక్ పోసుకుని గడగడ తాగేశాడు. సిగరెట్ వెలిగించాడు. పొగ వదుల్తూ ఆలోచిస్తున్నాడు.

అతడికి మిత్రులు లేరు. మంజూ తన జీవితంలోంచి తొలగిపోయాక స్నేహితులమీద అతడి నమ్మకం మాయమైంది. అతడు ఒంటరివాడై పోయాడు. అతడి ప్రియనేస్తం ఇప్పుడు అరక్ బాటిల్!

దేవదాసులా అతడు తాగేస్తున్నాడు. కాని పార్వతిలా మంజూ అతడికోసం బాధపడిన సూచనలు యెక్కడా లేవు. పెళ్ళికిముందు ఆమెను ఒకసారి రోడ్డుమీద అతడు చూశాడు. బీచ్‌కి రమ్మన్నాడు. వస్తానని ఆమె వెళ్ళి పోయింది.

రాత్రి పన్నెండుదాకా అతడు బీచ్‌లో కూర్చుని

ఆమెకోసం ఎదురు చూశాడు. కాని ఆమె రాలేదు. వచ్చి తనని కల్సుకోవాలనే వుద్దేశం ఆమెకు వుండి వుండదు! మంజూ హృదయం పాషాణంగా ఎలా మారి పోయింది?

గ్లాసులో అరక్ పోసుకుని అతడు గడగడ తాగేశాడు. గొంతు కాలిపోయినట్లనిపించి మెల్లిగా సర్దుకుంది.

బీచ్‌లో ఒక వెన్నెల రాత్రి అతడికి జ్ఞప్తికొచ్చింది. అప్పట్లో ఒక కంపెనీలో టాక్సీ డ్రయివర్‌గా ఉద్యోగం చేసేవాడతను. ఇప్పటిలా స్వంత టాక్సీ లేదు.

టాక్సీలో ఆమెను అతడు బీచ్‌కి తీసుకెళ్ళాడు. పడవ పక్కనే ఇసుకలో వాళ్ళిద్దరూ కూర్చున్నారు.

సముద్రపు గాలి ఆహ్లాదంగా వుంది. చంద్రకాంతి వాళ్ళలో వింత కోర్కెను రేకెత్తిస్తోంది.

ఆమె తల అతడి ఒళ్ళో వుంది. ఆమె ఇసుకలో పడుంది, వెల్లకిలా.

"మంజూ, నువ్వు బి.ఎ. పాసయ్యావు. నాకు చదువు లేదు. నేనొక టాక్సీ డ్రయివర్ని. మన పెళ్ళికి మీ నాన్న గారు ఒప్పుకుంటారా?" అన్నాడతను.

ఆమె నవ్వింది.

"ఊరుకో రాజ్! మన పెళ్ళి అయి తీరుతుంది. దాన్ని ఎవ్వరూ ఆపలేరు. నీ కోసం పంచభూతాల్ని కూడా నేను ఎదిరిస్తాను" అందామె.

అతడు ముందుకు వంగి ఆమె ఎర్రటి పెదిమలను ఆవేశంలో ముద్దుపెట్టుకున్నాడు. ఆమె చేతులు అతడిని బలంగా చుట్టేశాయి!

"మంజూ!" అరిచాడతను. గుండె నొప్పి! కొంతసేపు అతడు మౌనంగా వుండిపోయాడు.

ఎవరో తలుపును తట్టారు. అతడు వెళ్ళి తలుపు తెర్చాడు. చక్కటి దుస్తుల్లో మాధవి లోపలకువచ్చింది.

అతడు తలుపు దగ్గరగా మూశాడు. కుర్చీలో కూర్చుని ఆమెవంక చూశాడు. ఆమె ఇప్పుడు అందంగా కనిపిస్తోంది. అతడు స్టేషన్‌లో చూసిన మాధవిలా లేదు!

"అమ్మగారు సినిమా చూడమని డబ్బిచ్చారు. సినిమాకి వెళ్ళకుండా ఇలా వచ్చాను" అంది మాధవి.

"ఎంత త్యాగం!" అన్నాడతను.

ఆమె అతడి కళ్ళలోకి చూసింది.

"నిన్ను చూసినప్పటినుంచీ ఏదో ఆప్యాయత నాలో ఏర్పడింది. కాస్త టైమ్ దొరికితో నిన్ను చూడాలని పిస్తుంది" అందామె.

అతడు గ్లాసులో ఆరక్ పోసుకుని వేగంగా తాగేశాడు. బాగా నిషాలో వున్నాడు.

"ఏం కనుక్కున్నావు, చెప్పు!" అన్నాడతను.

"ఆమె భర్తతో చాలా ఆనందంగా జీవితం సాగిస్తోంది. ఆమెకు ఒక్కగా నొక్క కొడుకు. ఆ కుర్రాడు చాలా బాగుంటాడు. మరో బిడ్డ పుట్టే అవకాశంలేదు. సీజరియన్ ఆపరేషన్ చేసి ఈ బిడ్డను బయటకు తీశారట" అంది మాధవి.

అతడు మౌనంగా వింటున్నాడు.

"వాళ్ళుండే ఇల్లు స్వర్గంలా వుంది."

"ఇంట్లో వాళ్ళమీద చెప్పు" అన్నాడతను.

"ఆమె రాణిలా జీవిస్తోంది. భర్త పొద్దుట పోయి రాత్రి పన్నెండింటికి వస్తాడు."

"ఆమె కొడుకు గురించి చెప్పు!"

"అప్పుడప్పుడు ఆమెతో నేను బీచ్‌కి వెళ్తాను.

బిడ్డను కూడా తీసుకువెళ్దాం. బీచ్‌కి వెళ్ళినప్పుడు పెరాంబులేటర్‌లో బాబుని కూర్చోబెట్టి నేను తిప్పుతాను."

"ఎక్కడ తిప్పుతావు?"

"కాంపౌండులో. ఒక్కోసారి రోడ్డుమీదకు కూడా ప్రామ్‌ని తోసుకెళ్తాను" అంది మాధవి.

అతడు వుషారుగా ఈల వేశాడు. గ్లాసులో అరక్ పోసుకున్నాడు. ఎత్తబోయాడు. ఆమె చెయ్యి అడ్డు తగిలింది. "ఇంక తాగొద్దు" అందామె.

"తాగితే ఏమవుతుంది?"

"ఆరోగ్యం పాడవుతుంది. అకాలంగా చస్తావు!" అందామె వుద్రేకంతో.

"పోతే పోనీ! ఇక్కడుండి చేసేదేమిటి? అనుకున్నదంతా పేక మేడలా కూలిపోతుంటే చూడ్డంకంటె చావడం మంచిది."

చాపమీద కూర్చున్న మాధవి అతడివైపు సూటిగా చూసింది.

పుట్టిన ప్రతి వ్యక్తికీ చావక తప్పదు. కాని చావడానికి మనం ప్రయత్నించకూడదు. జీవించడానికి ప్రయత్నించాలి!"

"నువ్వు బాగా చెప్తున్నావు. నువ్వు పనిమనిషివంటే నేను నమ్మను" అన్నాడతను.

"బి.ఎ. పాసయిన వ్యక్తి పనిమనిషిగా వుండొచ్చు. మనం ఏం పని చేసినా మనలో వుండేది మన సంస్కారం" అందామె.

అతడు కుర్చీలోంచి లేచి ఆమెవైపు చూశాడు.

"మాధవీ, నువ్వు ఎవరు? నిజం చెప్పు!" అరిచాడతను.

"ఎప్పుడో ఒకప్పుడు నా కథ పూర్తిగా నీకు చెప్తానులే. ఆ సమయం ఇంకా రాలేదు" అందామె.

అతడు గ్లాసువైపు చూశాడు. అందులో పైదాకా ఆరక్ వుంది. అమాంతంగా గ్లాసు తీసుకుని అతను ఆరక్ తాగేశాడు. ఆమెవైపు చూశాడు.

"బాబుని రేపు నువ్వు పెరాంబులేటర్‌లో రోడ్డు మీదకు తీసుకురా" అన్నాడతను.

"ఎందుకు?"

"అది నేను చెప్పను. తర్వాత నీకే తెలుస్తుంది. తప్పక తీసుకొస్తావుగా?"

"తీసుకొస్తాను" అందామె.

గదిలో క్షణకాలం నిశ్శబ్దంగా వుంది.

"బాబుకి ఏ విధంగానూ హాని జరగకూడదు!" అందామె.

"జరగదు". అన్నాడతను.

ఆమె లేచింది. "నేను వెళ్ళాలి" అందామె.

"టాక్సీలో దింపనా?" అడిగాడు.

"వద్దు బస్సులో వెళ్ళగలను" అని ఆమె వెళ్ళిపోయింది.

7

సాయంత్రం సమయం. పెరాంబులేటరులో ఆమె బాబుని కూర్చోబెట్టింది. సుందరి బాబును రెండుసార్లు ముద్దెట్టుకుంది.

"మాధవీ, ఎక్కువ దూరం తీసుకెళ్ళొద్దు. జాగ్రత్త!" అంది సుందరి.

ప్రామ్‌ను తోసుకుంటూ మాధవి రోడ్డు మీదకు వెళ్ళింది. మెల్లిగా బండిని తోస్తోంది. బాబు నవ్వు

తున్నాడు.

విశాలమైన రోడ్డు. కార్లు దూసుకుపోతున్నాయి.

చటుక్కున ఒక టాక్సీ పెరాంబులేటర్ పక్కనే ఆగింది. అతడు కిందకు దిగాడు. చక్రాలబండిలో వున్న బాబును అతడు ఎత్తుకున్నాడు. టాక్సీవైపు పరుగెత్తాడు.

ఆమె టాక్సీ పక్కకు వెళ్ళింది.

"ప్లీస్, బాబును నాకిచ్చేయి!" అందామె.

"బాబును నేను తిప్పుతాను."

"వద్దు. బాబు లేకుండా ఇంటికెళితే వాళ్ళు నన్ను చంపుతారు" అందామె. అతడు పిశాచంలా నవ్వాడు.

"నిన్ను చంపరు. వాళ్ళు చస్తారు. బాబును నేను తీసుకుపోతాను. నా గురించి చెప్పకు" అరిచాడతను.

ఆమె జవాబివ్వలేదు. టాక్సీ దూసుకు వెళ్ళిపోయింది.

పెరాంబులేటర్ని వెనక్కి తిప్పి ఆమె ఇంటివైపు పోనిచ్చింది. అతడు ఎందుకిలా చేశాడు?

ఏడుస్తూ ఆమె ఇంటికి చేరుకుంది. పోర్టికోలో పచార్లు చేస్తున్న సుందరి ఆమెవైపు వెళ్ళింది.

పెరాంబులేటర్ లోకి చూసింది. బాబు లేడు.

"ఏమైంది? బాబు ఏడీ?" అరిచింది సుందరి.

"వాళ్ళెవరో కారులో వచ్చి బాబును ఎత్తుకు పోయారమ్మా" అంది మాధవి ఏడుస్తూ.

సుందరి చెయ్యి పైకి లేచింది. మాధవి చంపమీద ఛళ్ళుమంది.

"కావలిస్తే నన్ను చంపండి! నేను పాపిష్టిదాన్ని. వాళ్ళను ఆపలేకపోయాను" అరిచింది మాధవి.

"ఆ కారు నంబరు చూశావా?"

"లేదమ్మా! నాకు నంబర్లు సరిగ్గా అర్థంకావు"
అందామె. సుందరి హాల్లోకి పరుగెత్తింది. రిసీవర్ ఎత్తి
నంబరు తిప్పింది.

"హాలో!" అందో స్త్రీ కంఠం.

"మా ఆయనతో మాట్లాడాలి" అందామె.

సుందరి ఏడుస్తోంది.

"సుందరీ, ఏమైంది?"

"బాబును ఎవరో ఎత్తుకుపోయారు."

"ఎప్పుడు?"

"మాధవి వాడిని పెరాంబులేటర్లో రోడ్డుమీదకు
తీసుకు వెళ్ళింది. కార్లో కొంతమంది వచ్చి వాడిని తీసుకు
పోయారు" అందామె'

"డార్లింగ్, ఏడవకు! ఇదేదో బ్లాక్ మెయిల్ అయి
వుంటుంది. వాళ్ళు డబ్బు అడుగుతారు. అది పారేస్తే
బాబును మనకు ఇచ్చేస్తారు" అన్నాడతను.

"బాబు నా ప్రాణం! వాడు లేకుండా నేను బతక
లేను" అంది సుందరి.

"మైడియర్, డోంట్ బాదర్! అవసరమైతే నేను
మినిష్టర్తో మాట్లాడ్తాను. గాభరాపడకు!"

"మీరు వెంటనే ఇక్కడకు రండి!" అందామె.

"నాకు చాలా పనులున్నాయి. రాలేను."

"అంతేనా?"

"అక్కడికొచ్చి నేను చెయ్యగలిగింది ఏమీ లేదు.
ఇక్కడినుంచే అంతా చేస్తాను. నువ్వు ధైర్యంగావుండు!
నాలాంటి కోటీశ్వరుల బిడ్డల్ని ఎత్తుకుపోతూ నేవుంటారు.
ఇదంతా డబ్బుకోసం జరుగుతుంది. డబ్బు పారేస్తే మన
బాబు తిరిగి వస్తాడు. అంతే" అన్నాడతను.

"అంతేనంటారా? బాబులేని ఇల్లు నరకంలా వుంది" అందామె.

"డోంట్ బాదర్!" అని అతను రిసీవర్ని పెట్టేశాడు.

చాలాసేపటివరకూ "హలో!" అని ఆమె అరుస్తూనే వుంది. కాని అటువైపునుంచి జవాబులేదు.

ఆమె హాల్లోని సోఫాలో కూర్చుంది. ఆమె పక్కనే నేలమీద మాధవి కూర్చుంది. ఇద్దరూ ఏడుస్తున్నారు.

బ్లాక్ మెయిలర్ ఫోన్ చేస్తాడు! ఫోన్ కాల్ కోసం సుందరి ఎదురుచూస్తోంది.

పది దాటింది. భర్త ఇంకా ఇంటికి రాలేదు. టెలిఫోన్ మ్రోగింది. "హలో!" అందామె.

"మీ బాబు క్షేమంగా వున్నాడు" అందో గంభీరమైన పురుష కంఠం.

"మీకెంత కావాలి?" అడిగిందామె.

అటువైపు పిశాచంలా ఎవరో నవ్వారు.

"నవ్వకండి. ఎంత కావాలో చెప్తే వెంటనే ఇస్తాను". అందామె.

"నాకు కావలసింది డబ్బుకాదు" అందా కంఠం.

"మరేం కావాలి?" అడిగిందామె.

"బాబుమీద నీకు చాలా ప్రేముందా?"

"వుంది. బాబు నా ప్రాణం. బాబు లేకుండా నేను బ్రతకలేను" అందామె.

"బాబు నీకు దొరక్కపోతే ఏం చేస్తావు?"

"బాధపడ్తాను. బెంగతో క్షీణించిపోతాను"అందామె.

"నాకు కావలసింది అదే! నువ్వు బాధపడాలి! ఏడ్వాలి! తిండి తినలేక కృశించిపోవాలి!" అర్చాడతను.

"ప్లీస్, నా బాబును నా కిచ్చేయండి!" అందామె.

"బాబు మాటలు వింటావా?"

"వింటాను" అందామె.

బాబు చేతిలో సూది దిగింది. బిగ్గరగా బాబు ఏడ్వసాగాడు. "బాబు ఏడుపు వినిపించిందా?"

"ప్లీజ్ వాడిని ఏడ్పించకండి! మీకేంకావాలన్నా ఇస్తాను. వాడిని నాకు అప్పగించండి!"

అటువైపునుంచి గంభీరంగా నవ్వాడతను.

"ప్రేమంటే యేమిటో నీకు తెలియాలి! నువ్వు గుండెలు బాదుకుంటూ యేడ్వాలి! కన్నీళ్ళలో మునిగి తేలాలి!" అరిచాడతను.

8

టైమ్ పన్నెండు దాటింది. పోర్టికోలో కారు ఆపి మోహనరావు దిగాడు. నలువైపులా నిశ్శబ్దంగా వుంది. అతడు హాల్లోకి వెళ్ళాడు. సోఫాలో సుందరి పడుకుని వుంది. నేలమీద పనిమనిషి నిద్రపోతోంది.

అతడు భార్య పక్కనే కూర్చున్నాడు. చేత్తో తట్టి ఆమెను లేపాడు.

కళ్ళు తెరిచి అతడివైపు చూసి ఆమె యేడ్వడం మొదలెట్టింది. ఆమె యేడుపు విని మాధవి మేలుకొన్నది.

"ఎంత ఘోరం జరిగిందో చూశారా?"

"చెప్పావుగా!"

"బాబు తిరిగి వస్తాడా?"

"సుందరీ, బాబు తప్పక తిరిగివస్తాడు. చిన్నతనంలో ఆరేళ్ళ వయస్సులో వుండగా నన్ను ఎత్తుకుపోయారు. అప్పట్లో లక్షరూపాయలు చెల్లించి నాన్నగారు నన్ను వాపసు తెప్పించారు. వాళ్ళతో నేను వారంరోజులపాటు వున్నాను. వాళ్ళు నన్ను చాలా బాగా చూశారు. నన్ను

ఏమాత్రమూ కష్టపెట్టలేదు."

"బాబును వాళ్ళు జాగ్రత్తగా చూస్తారని నమ్మొచ్చా?" అందామె.

"నమ్మొచ్చు."

క్షణకాలం ఆమె మాట్లాడలేదు. రుమాలుతో ఆమె కన్నీళ్ళను తుడిచాడు.

"భోజనం చేశావా?"

"తినలేదయ్యా" అంది మాధవి.

"తిండి మాని ఇలా యేడుస్తూ కూర్చుంటే బాబు రాడు. మనం ధైర్యంగా వుండాలి. పద తిందాం."

మాధవి లోపలకు పరుగెత్తింది. వాళ్ళు భోజనానికొస్తున్నారని సావిత్రమ్మతో చెప్పింది.

మోహనరావు, సుందరి డైనింగ్ రూమ్‌లోకి వెళ్ళారు. ఏర్ కండిషండ్ గది. కుషన్డ్ కుర్చీల్లో పక్కపక్కనే కూర్చున్నారు. అనేక ప్లేట్లను సావిత్రమ్మ వాళ్ళముందు టేబుల్ మీద పెట్టింది. మోహనరావు ఆకలితో తింటున్నాడు. సుందరి మౌనంగా కూర్చుంది.

"వాళ్ళు ఫోన్ చేశారా?"

"చేశారు."

"ఎంతడిగారు?"

"చెప్పలేదు. బాబుకోసం పరితపిస్తూ నేను బాధపడాలన్నారు" అందామె.

ఆలోచిస్తూ మోహనరావు తింటున్నాడు. ఫోన్ ద్వారా ఆ వ్యక్తి చెప్పినదంతా సుందరి ధరకు తెలిపింది. "విచిత్రంగా వుంది. నువ్వు బాధపడితే వాళ్ళకొచ్చేదేమిటి? శాడిస్టిక్! మొదట్లో అలా అన్నా మళ్ళీ ఫోనుచేసి యెంతకావాలో చెప్తారు. యెలా ఇవ్వాలో

కనుక్కో!" తింటూ అతడు భార్యవైపు చూశాడు.

"సుందరీ తిను! వాళ్ళు నిన్ను బాధపడమన్నారు. వాళ్ళకు సరైన జవాబు నువ్వు బాధపడకపోవడం!"

"నాకు తిండి వెళ్ళదు" అందామె ఏడుస్తూ.

"ఇలా ఏడుస్తూ కూర్చుంటే బాబు తిరిగివచ్చేసరికి నువ్వు అస్థిపంజరంలా వుంటావు. నిన్ను ఆ స్థితిలో చూసి నేనూ, వాడూ ఏడ్వాలి! ఏడుపు అంటే నాకు అసహ్యం. ప్లీస్, యేడ్వడం మాని తిను!"

ఆమె తినడానికి ప్రయత్నించింది. కాని ఆకలిలేదు! ఆమె మనస్సు బాబుమీదే వుంది. తనకోసం బాబు యేడుస్తున్నాడేమో! బాబుకి వాళ్ళు పాలు యిచ్చారో, లేదో!

9

అతడు ఆరక్ సేవిస్తున్నాడు. పక్కనే బాబు పక్క మీద నిద్రబోతున్నాడు.

అతడు బాబువైపు చూశాడు. తల్లిపోలిక! అచ్చగా తల్లిలాగానే వున్నాడు.

మొదట్లో బాబు విపరీతంగా ఏడ్చాడు. కొంతసేపు టాక్సీలో తిప్పేసరికి సీటుమీద పడుకుని నిద్రపోయాడు.

గ్లాస్కో డబ్బా, ఫారెక్స్, ఫీడింగ్ బాటిల్, కొన్ని బొమ్మలు, దుస్తులు బాబుకోసం కొన్నాడతను. తను పిన్ను గుచ్చినచోట ఎర్రగా వుంది. బిడ్డ యేడుపు తల్లికి వినపడాలని అతడు పిన్నును చేతిలోకి గుచ్చాడు. ఆ కుర్రాడి బాధ చూసి తర్వాత విచారించాడు.

నిషాలో వున్న అతడికి మంజూ గుర్తొస్తోంది. చాలా కాలం తర్వాత ఆ కంఠాన్ని ఫోన్‌లో విన్నాడు.

ఆమె తన్ని గుర్తుపట్టి వుండదు. ఎవడో బ్లాక్ మెయిలర్ డబ్బుకోసం బాబును యెత్తుకుపోయాడని

ఖావిస్తోంది. అందుకే యెంతకావాలని అడిగింది.

గ్లాసులోని అరక్‌ను తాగేసి అతడు పకపక నవ్వ సాగాడు. ఆ నవ్వుకు బాబు మేల్కొన్నాడు. కళ్ళు తెరిచి అతడివంక చూశాడు. "అమ్మా!" అంటూ అతడివైపు తప్పటడుగులు వేస్తూ వెళ్ళాడు. అతడి ఒళ్ళో పడుకున్నాడు. ఒళ్ళో పడుకున్న బాబువైపు అతడు సూటిగా చూశాడు. బాబు తీయగా నవ్వాడు. అదే నవ్వు! మరుపురానిది! అతడు మరువలేనిది!

అతడు బాబుకేసే చూస్తున్నాడు. గ్లాసులో అరక్ పోసుకున్నాడు. ఆ గ్లాసువైపు బాబు చెయ్యి చాచాడు.

"ఇది నీకు కాదు!" అన్నాడతను.

గ్లాసును టేబులుమీద పెట్టి అతడు లేచాడు. నీళ్ళలో గ్లాక్సో పౌడరు కలిపి దాన్ని బాటిల్లో పోసి తీసుకెళ్ళి బాబుకిచ్చాడు. తాగుతూ కూర్చున్నాడు బాబు.

అతడు గ్లాసులోని అరక్‌ను తాగేశాడు. తన ఫీడింగ్ బాటిల్ని పక్కన పడేసి బాబు నవ్వుతూ అతడి దగ్గర కొచ్చాడు. కోపంగా అతడు బాబువైపు చూశాడు. ఏడుస్తూ బాబు అతడి ఒళ్ళో పడ్డాడు. బాబుని ఎత్తుకుని అతడు గదిలో యిటూ అటూ తిరిగాడు.

కాస్సేపట్లో బాబు నిద్రపోయాడు. పక్కమీద బాబును పడుకోబెట్టి అతడు గ్లాసులో అరక్ మళ్ళా పోసుకున్నాడు.

కళ్ళు తిరుగుతున్నాయి. గోడలు, కుర్చీలు, గదిలోని అన్ని వస్తువులూ గిర్రున తిరుగుతున్నాయి.

తటాలున అతడు బాబు పక్కనే పడి, క్షణంలో కళ్ళు మూసి నిద్రపోయాడు.

పొద్దుట మేలుకున్నాడతను. బాబు ధరించిన గుడ్డలు

తడిసి వున్నాయి. అతడు లేచాడు. బాబును బాత్‌రూం లోకి తీసుకెళ్ళి బాగా కడిగాడు. తను కొన్న కొత్త వేసి, పౌడర్ పూసి, పాలతో నిండిన బాటిల్ తిత్తిని బాబు నోట్లో పెట్టాడు.

చేతులు, కాళ్ళు వూపుతూ బాబు తాగసాగాడు.

తను పనిలోకి వెళ్ళాలి! ఎలా? శిశువిహార్ అతడి గుర్తొచ్చింది.

అతడు తొందరగా తయారయ్యాడు. కావలసిన వస్తువులను ప్లాస్టిక్ బుట్టలో పెట్టాడు. బాబుని ఎత్తుకుని ప్లాస్టిక్ బుట్ట పట్టుకుని, బయటకు నడిచి తలుపు మూసి తాళం వేశాడు. ముందు సీటుమీద బాబును కూర్చోబెట్టి టాక్సీని పోనిచ్చాడు.

శిశువిహార్‌లో బాబునూ, ప్లాస్టిక్ బుట్టనూ అప్పగించి అతడు స్వేచ్ఛగా తన టాక్సీవైపు నడిచాడు.

రాత్రి తొమ్మిదిదాకా బాబును వాళ్ళు అక్కడ జాగ్రత్తగా చూస్తారు. అతను తన పని చేసుకోవచ్చు.

సాయంత్రం మూడింటికి అతడు ఒక టెలిఫోన్ బూత్‌లోకి దూరాడు. ఒక నంబరు తిప్పి యాభై పైసల కాసు పడేశాడు.

"హలో!" అందొక స్త్రీ కంఠం అటువైపునుంచి.

"నీ కొడుకు బాగానే ఉన్నాడు" అన్నాడతను.

"మిస్టర్ నీకేం కావాలి? నన్నెందుకిలా పీడిస్తున్నావు?" అందామె.

"ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది!"

"ప్లీజ్, ఎంత డబ్బు కావలసినా యిస్తాను. నా బాబును నాకిచ్చేయి."

అతడు వెటకారంగా నవ్వాడు.

"డబ్బుతో నువ్వు ప్రేమించిన బాబును కొనలేవు!"

"దేనితో కొనగలను చెప్పు!" అందామె.

"ఏడ్వాలి! దుఃఖసముద్రంలో అల్లల్లాడాలి! ఆకలి చచ్చి చిక్కి శల్యమవ్వాలి!"

అటువైపున ఆమె వెక్కి వెక్కి యేడుస్తోంది.

అతడు రిసీవర్ పెట్టేసి బయటకు నడిచి టాక్సీలో కూర్చుని తలుపు మూశాడు. టాక్సీ కదిలింది.

10

టైమ్ పది దాటింది. అతడింకా ఇంట్లోనే ఉన్నాడు. బాబుతో ఆడుకుంటూ కూర్చుండిపోయాడు.

ఎవరో తలుపును తట్టారు. అతడు వెళ్ళి తలుపు తెర్చాడు. మాధవి కన్నీళ్ళతో లోపలకు దూసుకొచ్చింది.

"బాబును ఎత్తుకుపోవద్దంటే వినలేదు. నువ్వు చేసిన పని మూలంగా ఆనందంగా బతికే ఒక యువతి జీవితం అకాలంగా అంతరించింది" అందామె.

"ఏమైంది?" అడిగాడతను ఆమెవైపు చూస్తూ.

"సుందరి మాతిలో పడి మరణించింది. తోటమాలి ఆమె శవాన్ని బయటకు లాగాడు...."

"మంజూ! మంజూ!" అర్చాడతను.

అతడి కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. ఆమె అతడి దగ్గరగా వెళ్ళి చెయ్యి పట్టుకుంది.

"బాబును వెంటనే ఆ యింటికి పంపేయి. తల్లి శవాన్ని ఆఖరిసారిగా చూసే అవకాశాన్ని అతడికి కల్పించు" అందామె.

"బాబే కాదు, ఆమెను నేనూ చూడాలి. కాని ఎలా?"

"అక్కడికెళ్ళి ఆమెను చూడాలంటే యిదే సరైన

సమయం. ఆమె భర్తకు ఫోన్ చేశాను. కాని ఆయన ఆఫీసులో లేరు. తోటమాలీ, నేనూ ఆమె శవాన్ని పడగ్గదిలో చాపమీద పడుకోబెట్టాం. నేను వెంటనే యిక్కడకు ఆటోలో వచ్చాను" అందామె.

"ఆమెను చూడ్డానికి తెగిస్తాను" అని అతడు బయల్దేరాడు.

బాబును ఆమె ఎత్తుకుని బయటకు నడిచింది. తలుపు మూసి అతడు తాళం వేశాడు. ఆమె కారులో కూర్చుంది. అతడు టాక్సీని విమానంలా పోనిచ్చాడు.

గేటు తెర్చి వుంది. గూర్ఖా స్టూల్ మీద కూర్చుని వున్నాడు. అతడు టాక్సీని లోపలకు పోనిచ్చి పోర్టికోలో ఆపాడు. వాళ్ళు కిందకు దిగారు. చప్పుడు చేయొద్దని ఆమె అతడిని హెచ్చరించింది.

హాల్లో యెవ్వరూ లేరు. ఒక గదివైపు వాళ్ళు నడిచారు. ఆమె తలుపును తోసింది. విచారవదనంతో అతడిని లోపలకు వెళ్ళమంది.

ఆమెనుంచి బాబును అతడు తీసుకున్నాడు. మెల్లిగా లోపలకు వెళ్ళాడు. అతడి గుండె వేగంగా కొట్టుకుంటోంది. కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

తడిగుడ్డలో ఆమె నేలమీద వెల్లకిలా పడుంది. ఆమె పక్కనే అతడు బాబును వదిలాడు. "అమ్మా!" అని ఏడుస్తూ బాబు ఆమెవైపు వెళ్ళి మీదపడ్డాడు.

"మంజూ!" అని పిలుస్తూ అతడు ఏడ్వసాగాడు.

ఆమెను చూడలేక వెనక్కు తిరిగాడు.

"రామ్!" పిల్చారెవరో.

అతడు తిరిగి ఆమెవైపు చూశాడు.

చాపమీద పడున్న సుందరి తటాలున లేచింది.

"రామ్, నేను బతికే ఉన్నాను. చావలేదు" అందామె.

నిర్ఘాంతపోతూ ఆమెవైపు చూస్తూ వుండిపోయాడతను. ఆనందంతో అతడలాగే నిలబడ్డాడు కొంతసేపు.

"మంజూ, నేను చేసిందానికి నన్ను క్షమించు. కాని నువ్వు ఆడిన యీ నాటకం దేనికోసం? నన్ను పోలీసులకు పట్టివ్వడానికా?" అడిగాడతను.

ఆమె తీయగా నవ్వింది.

"రెండోసారి ఫోన్ చేసినపుడు నీ కంఠాన్ని నేను గుర్తించగలాను. అంతేకాదు. మాధవి కూడా నాకు నిజం చెప్పేసింది. నేను మరణించేనని నీకు తెలిస్తే నా శవాన్ని చూడ్డానికి నువ్వు వస్తావనీ, బాబును తిరిగి యిచ్చేస్తావనీ నాకు తెలుసు. అందుకే యీ నాటకం నేనూ, మాధవీ కలిసి ఆడాం. నిన్ను పోలీసులకు పట్టివ్వాలనే ఉద్దేశం లేదు నాకు. అటువంటి దురుద్దేశం నాకెప్పుడూ ఉండదు."

అతడు మౌనంగా వింటున్నాడు.

"నీ ప్రేమ చాలా గొప్పది. దాన్ని ద్వేషంగా మారనీయకు రామ్! నిజమైన ప్రేమ భార్యకాలేకపోయినా యువతిని చెల్లెలుగా ఆదరించగలదు. హృదయంలో వింత ప్రేమున్నా విధి మనుషుల్ని మరో తోవమ్మట లాక్కుపోతుంది. విధినెవ్వరూ యెదిరించలేరు, రామ్!"

ఆమె ఆగింది. అతడివైపు నవ్వుతూ చూసింది. "రామ్, ఇటువైన నువ్వు ఒంటరిగా జీవిస్తే నేను భరించలేను. నీ పెళ్ళిచేసే బాధ్యత నాదీ. నీకోసం ఒక మంచి అమ్మాయిని చూశాను" అని ఆమె మాధవివైపు చూసింది.

అతడు మౌనంగా నిలబడ్డాడు.

"రామ్, మాధవి నీతో తనని గురించి ఏదేదో చెప్పింది. అదంతా అబద్ధం. ఆమె సంస్కారంగల యువతి. విచారకరమైన పరిస్థితుల్లో ధైర్యంగా ఆమె ఇక్కడికి వచ్చేసింది. నిన్ను పెళ్ళాడ్డానికి ఆమె సిద్ధంగా వుంది" అంది సుందరి.

"నేను వెళ్ళనా?" అడిగాడతను.

"స్వేచ్ఛగా వెళ్ళొచ్చు! యెవ్వరూ నిన్ను ఎక్కడా ఆపరు" అంది సుందరి.

"అద్దేమిటమ్మగారూ అలా అంటారు? అతడి తోవకు నేను అడ్డుపడ్డాను" అంది మాధవి.

ముగ్గురూ పకపక నవ్వారు. అతను బయటకు నడిచాడు. పోర్టికోలో వున్న టాక్సీ దగ్గరకు చేరుకున్నాడు.

మాధవి అతని వెనకనే పరుగెత్తింది.

"ఇక్కడ కాదు, నా ఇంటికిరా, నీకు బుద్ధి చెప్తాను" అన్నాడతను నవ్వుతూ.

"ఏం చేస్తావో వచ్చి చూస్తాను" అంది మాధవి నవ్వుతూ.

అతడు కూర్చుని తలుపు మూశాడు. టాక్సీ కదిలే ముందు వరండావైపు చూశాడు. బాబుని ఎత్తుకుని సుందరి అక్కడ నిలబడి వుంది.

టాక్సీ పోగానే సుందరి ఫోన్ దగ్గరకు వెళ్ళి రిసీవరెత్తి ఒక నంబరు తిప్పింది. కాస్సేపట్లో భర్త కంఠం అటువైపునుంచి వినపడింది. "ఎవరో బాబుని తీసుకొచ్చి వరండా మీద వదిలేశారు!" అందామె ఆనందంగా.

—: అయిపోయింది :—